రోయ్ లే-అవుట్‌లో
40x40 కమర్షియల్ గొడౌన్ గ్రౌండ్ ఫ్లోర్
40x40 ఫస్ట్ ఫ్లోర్
అద్దెకు ఇవ్వబడును
కాంటాక్ట్ నెంబర్లు 9441937973
9440343432
నియర్ జోసెఫ్ కాన్వెంట్, శ్రీకాకుళం.



SSC GD కానిస్టేబుల్స్ & RRB
శ్రీకాకుళంలో మొదటిసారి కార్పోరేట్ ప్రమాణాలతో..
ఫ్రీ మెగా సెమినార్
తేది: 27-10-2024 (ఆదివారం) ఉదయం 9 గం॥లకు
అర్థమెటిక్: చలం రవి గారు (25 Years Experience)
ఇంగ్లీష్: గుణశేఖర్ గారు (Senior Faculty)
రీజనింగ్: తులసి గారు, శంకర్ గారు
ప్యూర్ మేథ్స్: గురునాయుడు గారు
SOLVE ACADEMY Srikakulam
86881 72010
90300 28181



ICL COURIER
INTERNATIONAL COURIER & CARGO
విదేశాలకు అతి తక్కువ ధరలో వేగవంతమైన సర్వీసు
పచ్చళ్లు ▸ బట్టలు ▸ పిండివంటలు ▸ బుక్స్ ▸ స్వీట్స్ ▸ మెడిసిన్స్ మొదలగునవి పంపించబడును.
- Free Door Step Pickup - World wide Services
- Low Cost & Fastest Delivery - Easy Online Tracking
- Safe & Secure Delivery - Free Box Packing
దూదివారి కోవెల ప్రక్కన, చిన్నబజార్ రోడ్, శ్రీకాకుళం.
9989172822, 9505944472, 9248199493



సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
శుక్రవారం 25-10-2024
సంపుటి: 20 సంచిక: 180
పేజీలు: 4 వెల: రూ.1




# చిల్లర తమ్ముళ్లది.. పెద్దనోట్లు వైకాపావి!

* నదిలో లభ్యత లేకపోయినా తవ్వకాలు
* ఇసుక పెద్ద పెద్ద లోడింగ్‌లు వైకాపా నేతలు
* స్థానికంగా తెలుగుతమ్ముళ్ల సరఫరా
* సమీప ప్రాంతాల్లోనే స్టాక్ పాయింట్లు
* సొంత స్థలాల్లోనే ఇసుక డంపింగ్
* అడ్డుకోలేక చేతులెత్తేస్తున్న అధికారులు

"ఇసుకను ఉచితంగా తరలించుకుపోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పసుపుజెండా ఊపినా దాన్ని పెద్ద ఎత్తున క్యాష్ చేసుకోవడంలో తెలుగు తమ్ముళ్లు వెనుకబడిపోయారట. 2014-19 మధ్యలో ఎవరైతే ట్రాక్టర్ల ద్వారా ఇసుకను విక్రయించుకున్నారో, ఇప్పుడు అవే కుటుంబాలు ఇసుకను తరలిస్తున్నాయి. ప్రస్తుతం జిల్లాలో నదీ పరివాహక ప్రాంతాలన్నింటిలోనూ తవ్వుకోడానికి అనధికారిక అనుమతులు రావడంతో ఇసుకకు డిమాండ్ కూడా తగ్గిపోయింది. ట్రాక్టర్ లోడ్ ఇసుకను రూ.1200కు సరఫరా చేస్తున్నారు. ఎందుకంటే.. ప్రతీ గ్రామంలోనూ 400కు తక్కువ ట్రాక్టర్లు ఎక్కడా లేవు. దీంతో సరఫరా ఎక్కువ, డిమాండ్ తక్కువ ఉంది. అయితే ఇందులో ప్రధానంగా చర్చించుకోవాల్సింది బల్క్ లోడింగ్. 2019-24 మధ్యలో ఇసుకలో వేలు పెట్టడానికి స్థానికులకు అవకాశం లేకపోవడంతో ఆ సమయంలో స్మగ్లింగ్ తరహాలో చేసిన వైకాపా నాయకులకు ఎక్కడి నుంచి బల్క్ ఆర్డర్ తెచ్చుకోవాలి, ఎక్కడికి పంపిస్తే రేటు ఎక్కువ వస్తుంది.. వంటి అంశాలు తెలుసు. దీంతో ప్రస్తుతం పెద్ద పెద్ద లోడింగ్‌లు వైకాపా నేతలు, స్థానిక ఇసుక సరఫరాను తెలుగు తమ్ముళ్లు చేస్తున్నారు. ఇప్పటికైతే ఇసుక మీద ఎటువంటి విధానమూ లేదు. దొరికినోడు దొరికినంత ఇసుకను తీసుకెళ్లవచ్చు. అయితే దీన్ని స్థానిక అవసరాలకు సరఫరా చేస్తున్నది తెలుగు తమ్ముళ్లయితే పెద్ద ఎత్తున కాంట్రాక్టర్లకు అమ్ముకుంటున్నది గత ప్రభుత్వంలో ఇసుకను అమ్ముకున్న వైకాపా నేతలే. ఈ విషయం ఎక్కడికక్కడ ఎమ్మెల్యేలకు తెలిసినా ఇందులో అనుభవం లేకపోవడం వల్ల ఏమీ చేయలేకపోతున్నారు."

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉచిత ఇసుక విధానాన్ని అధికార పార్టీకి చెందిన నాయకులు దుర్వినియోగం చేస్తున్నా అడ్డుకోలేక జిల్లా ఉన్నతాధికారులు చేతులెత్తేశారు. ఈ విధానాన్ని అడ్డు పెట్టుకొని రోజూ వందల లారీల్లో వేల టన్నుల ఇసుకను జిల్లా సరిహద్దులు దాటి విశాఖకు అక్రమంగా తరలించుకుపోతున్నారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం టీడీపీ నాయకులు జేబుల్లోకి వెళ్లిపోతోంది. సహజవనరుల దోపిడి జరిగిపోయిందని వైకాపా హయాంలో గగ్గోలుపెట్టిన కూటమి పార్టీల నాయకులు ఇప్పుడు ఆయా పార్టీల నాయకులు చేస్తున్న దోపిడిని సమర్థించుకొనే పనిలో నిమగ్నమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నాగావళి, వంశధార పరివాహక ప్రాంతాల్లో స్థానికులు ఇసుక మాఫియాపై ఉన్నతా ధికారులకు ఫోన్ చేసినా స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. శ్రీకాకుళం పరిధిలో బైరి, కరజాడ, పొన్నాం, బట్టేరు, గార పరిధిలో అంబళ్లవలస, బూర విల్లి, జోగిపంతులపేటల్లో ట్రాక్టర్లలో ఇసుకను లోడ్ చేసి సమీప ప్రాంతాల్లో స్టాక్ పాయింట్లు ఏర్పాటుచేసి డంప్ చేస్తున్నారు. నదిలో యంత్రాలతో తవ్వి లోడ్ చేసిన ఇసుకను సింగుపురం పరిధిలోని హాటకేశ్వరస్వామి కొండ - మిగతా 4లో



## గంజాయి సేవిస్తూ పోలీసులకు చిక్కిన యువకులు..!

- ఫరీద్‌పేటకు చెందిన ముగ్గురు అరెస్టు -



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గంజాయి అక్రమరవాణా, విక్రయం, సేవించడంపై ఇటీవల జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. అందులో భాగంగానే బహిరంగంగా గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను శుక్రవారం ఎచ్చెర్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేటలో నిర్మాణంలో ఉన్న ఎలిమెంట్రీ స్కూల్ భవనంలో ముగ్గురు యువకులు గంజాయిని సిగరెట్‌లో పెట్టి సేవించినట్టు విశ్వసనీయ సమాచారం. గంజాయిని పొట్లాన్ని విప్పి కాగితంలో వేసి దాన్ని సిగరెట్‌లో చొప్పించి దమ్ములాగేందుకు సిద్ధమయ్యారు. ఈ వ్యవహారాన్ని యువకులు వీడియో తీసి వాటిని స్నేహితులకు షేర్ చేసినట్టు తెలిసింది. ఈ వీడియో వైరల్ కావడంతో దీని ఆధారంగా వీడియోలో గంజాయిని సిగరెట్‌లో పెట్టి సేవించడానికి సిద్ధమైన ముగ్గురు యువకులను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లినట్టు తెలిసింది. వీరు గంజాయిని కొనుగోలు చేశారా, రవాణా చేస్తున్నారా అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. గంజాయిని రవాణా చేసే బ్యాచ్‌తో వీరికి ఉన్న - మిగతా 4లో



















• ఎడిటోరియల్

## జనం మతిస్థిమితం కోల్పోయి చాలా కాలమైంది

యూట్యూబ్ ఛానెళ్లకి అఘోరీ రూపంలో విందు దొరికింది. ఆమె శవాల్ని తింటే, వీళ్లు ఆమెని తినడం మొదలుపెట్టారు. వెనుకటికి తమిళ దర్శకుడు బాల 'నేను దేవున్ని' అనే సినిమా తీసాడు. దాంట్లో హీరో అఘోర. బాలకృష్ణని కూడా అఘోరగా చూశాం. హైదరాబాద్‌లో ప్రత్యక్షమైన అఘోరి ప్రత్యేకత ఏమంటే ఆవిడ కారు నడుపుతుంది. ఆ కారుకి నెంబర్ ప్లేట్ వుండదు. కారు నిండా పుర్రెలుంటాయి. భయంకరమైన బొమ్మలుంటాయి. అఘోరి నగ్నంగా వుంటుంది. వీడియోల్లో బ్లర్ చేస్తారు. ఆవిడ వీడియోలకి మిలియన్ల కొద్ది వ్యూస్ వచ్చేసరికి యూట్యూబ్‌ల వాళ్లు జూలు దులుపుకుని పరిగెత్తారు. వెనక పడతామనే భయంతో ఆమెని వెతికి పట్టుకున్నారు. అఘోరి కూడా మంచిదే. అలసట లేకుండా ఇంటర్వ్యూలు ఇస్తూ ఇంగ్లీష్ కూడా మాట్లాడుతుంది. ఎక్కడో కేదార్‌నాథ్‌లో తపస్సు చేసుకునే ఆవిడ హఠాత్తుగా జనంలోకి వచ్చి పాపులారిటీ ఎందుకు కోరుకుంటూ వుందో తెలియదు. సనాతన ధర్మ రక్షణ కోసం అంటున్నారు. దానికి పవన్‌కల్యాణ్ ఉన్నారు కదా, మళ్లీ ఈవిడ ఎందుకు? ఈ మధ్య విగ్రహాల ధ్వంసమని వివాదంలోకి సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడి ఎక్కింది. నిజానికి అది ఎక్కడుందో కూడా ఎవరికీ తెలియదు. ఒక్కసారిగా వార్తల్లో నిలిచింది. ఆ గుడికి అఘోరి వెళ్లి ఒంటికాలు మీద నిలబడి కాసేపు ధ్యానం చేసి గట్టిగా చప్పట్లు కొట్టి అరిచింది. అక్కడ కాపలా ఉన్న పోలీసులు కూడా అఘోరిని చూసి భయభక్తులతో నిలబడ్డారు. ఆమె చప్పట్లు కొట్టిన విధానం చూసి ట్రాన్స్‌జెండర్ అని నిరూపించడానికి కొన్ని ఛానెళ్లు కంకణం కట్టుకున్నాయి. కొంతమంది ట్రాన్స్‌జెండర్లతో ఇంటర్వ్యూలు కూడా నిర్వహించాయి. యాంకర్లు కూడా అఘోరి ఇంటర్వ్యూల్లో డోస్ పెంచారు. పీడియడ్స్ వస్తాయా? సెక్స్ కోరికలు వుండవా? ఏం అడక్కూడదో అవన్నీ అడిగి థంబ్‌నెయిల్స్ పెడుతున్నారు. జనం కూడా మతిస్థిమితం కోల్పోయి చాలా కాలమైంది కాబట్టి వేలంవెర్రిగా చూస్తున్నారు. కొంతమంది ఉత్సాహవంతులు వెనుకపడిపోయామన్న భయంతో పరిశోధన మొదలుపెట్టారు. అఘోరి తల్లిదండ్రుల ఇంటర్వ్యూ చేశారు. జూబ్లీహిల్స్‌లో అఘోరి పేరుతో కోట్ల రూపాయల ఇల్లు ఉన్నట్టు కనిపెట్టారు. ఒకాయన మెడ నిండా రుద్రాక్షలు ధరించి, సెమీ అఘోరాలా మారి ఇంటర్వ్యూలో జ్ఞాన ప్రదర్శన చేశాడు. రుద్రాక్షలు ఎన్ని రకాలు, ఉపయోగాలు ఏంటి? స్మశానంలో ఉన్న శివుడు కనిపిస్తాడా? పురుష కపాళం, స్త్రీ కపాళానికి తేడా ఏమిటి? (కపాళ మోక్షం తర్వాత అంతా ఒక్కటే కదా, కనీసం స్మశానంలో కూడా స్త్రీ, పురుషుల్ని సమానంగా వుండనివ్వరా? పుర్రెని చూస్తే టెర్రర్ తప్ప జెండర్ గుర్తొస్తుందా?) ఇలా రకరకాల ప్రశ్నలు వేసి అఘోరీని ఫెయిల్ చేసి ఫేక్ అని నిరూపించే ప్రయత్నం. రకరకాల యూట్యూబ్ ఛానెల్స్ చిత్రవిచిత్ర థంబ్‌నెయిల్స్‌తో లైవ్ హారర్ చూపిస్తున్నాయి. కెమెరాలతో తిరుగుతున్న అఘోరీలు వీళ్లు. తమాషా ఏమంటే మెయిన్ ఛానెల్స్ వాళు ఇంకా అఘోరీని అందుకోలేదు. తమ స్థాయి కాదనుకున్నారేమో! వాళ్లు కూడా మొదలుపెడితే అఘోరీని స్టూడియోలో కూడా చూడొచ్చు. ఆమెతో పాటు ఐదారుగురు బట్టల్లేని నాగ సాధువులు, గడ్డాలున్న స్వామీజీలు అంతా కలిసి ప్రళయాన్ని ఆపే విధానాన్ని చర్చిస్తారు. దేవుడు ఎలాగూ కనపడడు. అఘోరీలు కనిపిస్తున్నారు. దండం పెడితే పుర్రెతో ఆశీర్వదిస్తారు. నెంబర్ ప్లేట్ లేకుండా తిరిగితే పోలీసులు కేసు పెట్టాలా? వద్దా? కేసు పెడితే ఆమె బట్టలు లేకుండా వస్తానంటే జడ్జి ఒప్పుకోడు. వెనుకటికి మంగమ్మవ్వ బట్టల్లేకుండా తిరిగేది. పొడుగాటి జుత్తు ఉండడం వల్ల బ్లర్ చేయాల్సిన అవసరం ఉండేది కాదు. ఆమె హత్య కేసులో ఇరుక్కుంటే, కోర్టుకి నగ్నంగా రావడానికి జడ్జి ఒప్పుకోలేదు. తెరల మధ్య తీసుకురావాల్సి వచ్చింది. కళ్లు ఉన్నందుకు ఎన్నెన్ని చూడాలో! విచిత్రమేమిటంటే.. ఏ పుర్రె చూసి భయపడతామో మనలోనే ఆ పుర్రె ఉంది. ఆ పుర్రెలో ఇమిడివున్న మస్తిష్కంతోనే మన ఆలోచనలు, మనము ముందుకు సాగుతామని మర్చిపోతాం. అంటే మనమంటేనే మనకు భయం. విపరీతంగా పుట్టుకొచ్చిన గొట్టాల వల్లే ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియడంలేదు. అఘోరీలంటే ఎవరో తెలీనోళ్లు అఘోరించడం వల్లే ఈ పరిస్థితి వచ్చింది. నిజంగా ఏ హిమాలయాల్లోనో, బాహ్య ప్రపంచానికి దూరంగా, భిన్నంగా బతికే ఓ జాతిని తీసుకువచ్చి తపస్సులు లేకుండా, యోగసాధనాలు లేకుండా అఘోరీలంటూ చూపించడం మనకే చెల్లింది. నిజానికి ఈ వింతజీవిని పట్టుకొని లోపలేసి నాలుగు తంతే అన్ని బూడిదలు తొలగిపోయి అసలు స్వరూపాలు బయటపడతాయి. ఇక్కడ స్వరూపానందకే కాదు.. అందరికీ మరో స్వరూపాలు ఉన్నాయి.

## 26న మున్సిపల్ కార్యాలయంలో ప్రజాదర్బార్




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగరంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే గొండు శంకర్ అధికారులతో కలిసి ఈ నెల 26న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. నగరంలోని 50 డివిజన్స్‌లో రెండోసారి శుక్రవారం 29 డివిజన్లలో ప్రజల సమస్యలపై స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తారన్నారు. పాత 50 డివిజన్ల ప్రకారం 1 నుంచి 21 వరకు, 43 నుంచి 50 వరకు మొత్తం 29 డివిజన్లు, అలాగే చాపురం, పెద్దపాడు, పాత్రునివలసలకు సంబంధించి దర్బార్ ఉంటుందని, ఆయా డివిజన్ ఇన్‌ఛార్జిలు, పార్టీ నాయకులు, కూటమి నాయకులు, అన్ని వర్గాల ప్రజానీకం అందుబాటులో ఉండాలని కోరారు.

## హైవే విస్తరణకు రూ.252.42 కోట్లు

- మౌలిక వసతుల కల్పనకు భారీగా నిధులు
- జిల్లాకు మంజూరు చేసిన కేంద్రప్రభుత్వం
- ఫలించిన కేంద్రమంత్రి రామ్మోహన్ చొరవ
- 6 లైన్లతో జాతీయ రహదారి నిర్మాణానికి నిధులు కేటాయింపు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా అభివృద్ధిలో కీలకమైన జాతీయ రహదారి విస్తరణకు మార్గం సుగమమైంది. నరసన్నపేట - శ్రీకాకుళం - విశాఖపట్నం మధ్య కీలకంగా ఉన్న ఈ రోడ్డు నిర్మాణాలు పూర్తి చేయాలని కోరుతూ కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కేంద్రంపై తీసుకొచ్చిన ఒత్తిడి ఫలించింది. ఈ మేరకు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారి-16 మార్గంలోని రణస్థలం వద్ద హైవే విస్తరణకు కేంద్ర ప్రభుత్వం రూ.252.42 కోట్లు మంజూరు చేసింది. దీనికి సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రి కార్యాలయం గురువారం విడుదల చేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. ఇందులో రాజధాని నగరం అమరావతి నుంచి రూ.2,245 కోట్లతో రైల్వే లైన్ నిర్మాణానికి ఆమోదం తెలపగా, జిల్లాలోని రణస్థలం వద్ద హైవే విస్తరణకు సవరణలతో కూడిన కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీనిలో భాగంగా రూ.252.42 కోట్లు కేటాయిస్తూ తాజాగా నిర్ణయం తీసుకుంది.

**తొలగిన అడ్డంకులు...**

జాతీయ రహదారి-16లోని విశాఖపట్నం-శ్రీకాకుళం-నరసన్నపేట మధ్య 6 లైన్లతో 100 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణకు నిధులు కేటాయించాలని అప్పట్లో



ఎంపీగా ఉన్న ప్రస్తుత కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర రోడ్డు, రవాణా శాఖామంత్రి నితిన్ గడ్కరీని పలుమార్లు కలిసి, ప్రతిపాదనలు అందించారు. దీంతో రూ.3వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. రణస్థలం మినహా మిగతా మార్గంలో నిర్మాణాలు పూర్తిచేసింది. 2014లో చేపట్టిన సర్వే ప్రకారమే భూములు, ఆస్తులు కోల్పోయిన వారికి పరిహారం ఇస్తామని చెప్పడంతో రైతులు దీనికి అంగీకరించలేదు. సమస్యను సవాల్‌గా స్వీకరించిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు బాధ్యతలు చేపట్టిన నుంచి కేబినెట్‌లో పలుమార్లు ప్రస్తావిస్తూ వస్తున్నారు. తాజాగా కేంద్ర మంత్రిమండలి ఆమోదంతో ఏళ్లుగా పెండింగ్‌లో ఉండిపోయిన ఈ నిర్మాణాలు మళ్లీ పట్టాలెక్కనున్నాయి. దీనిపై ఢిల్లీ నుంచి రామ్మోహన్‌నాయుడు స్పందించారు. జిల్లా ప్రగతి భాగమైన హైవేల విస్తరణకు ఆమోదం తెలిపిన ప్రధాని నరేంద్రమోడీతో పాటు రోడ్డు, కేంద్ర రోడ్డు, రవాణా మంత్రి నితన్ గడ్కరీకి జిల్లా ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అమరావతిలో రూ.2,245 కోట్లతో రైల్వేలైన్ ఏర్పాటుకు పచ్చజెండా ఊపడంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధికి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల చిత్తశుద్ధిని ఈ సందర్భంగా ఆయన ప్రసంశించారు.

## సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

* సిబ్బంది సమస్యల పరిష్కరానికి ప్రాధాన్యత
* జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

సిబ్బంది ప్రతిఒక్కరు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ మైదానంలో నిర్వహించిన పోలీస్ పరేడ్‌కు ఎస్పీ హాజరయ్యారు. ఈ క్రమంలో ముందుగా ఆర్మ్‌డ్ సిబ్బంది ఎస్పీకి గౌరవ వందనం సమర్పించిన అనంతరం పరేడ్ నిర్వహించారు. సిబ్బంది నిర్వహించిన పరేడ్‌ను ఎస్పీ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, ప్రతిరోజు కొంత సమయాన్ని వ్యాయామానికి కేటాయించి మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని, అలాంటప్పుడే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలమని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ విధులు నిర్వహించాలని, చెడు అలవాట్లకు బానిస కాకుండా మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అన్నారు.

**సిబ్బందికి ప్రత్యేక గ్రీవెన్స్**

ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ మైదానంలో ఎస్పీ పోలీస్ సిబ్బంది కోసం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో పలువురు పోలీసు సిబ్బంది వారి వ్యక్తిగత, ఉద్యోగరీత్యా సమస్యలను వినతుల రూపంలో తెలుసుకున్నారు. సిబ్బందికి వ్యక్తిగత, ఉద్యోగరీత్యా సమస్యల పరిష్కరించి సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని, ఎటువంటి సమస్యలు ఉన్న దృష్టికి తీసుకురావాలని, సాధ్యాసాధ్యాలు బట్టి సమస్యలు పరిష్కరిస్తానని ఎస్పీ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ ఎల్.శేషాద్రి, ఆర్ఐ కె.నర్సింగరావు, ఎస్ఐలు ఏఆర్, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.



## గేమ్‌చేంజర్ కోసం గట్టిగానే ప్లాన్ చేస్తున్నారు!

వందల కోట్ల బడ్జెట్, స్టార్ క్యాస్టింగ్.. పెట్టిన బడ్జెట్ కి, చూపిస్తున్న స్టార్ క్యాస్టింగ్‌కు తగిన బజ్ మాత్రం ఇంకా రావడం లేదు. మూడేళ్ళకు పైగా సినిమా నిర్మాణం, దర్శకుడిపై ఇండియన్ 2 ప్రభావం, మొదటి సాంగ్ మీద వచ్చిన నెగిటివిటి.. ఇలా అన్నీ గేమ్ ఛేంజర్ మూవీ పై బాగా ఎఫెక్ట్ చూపిస్తున్నాయి. దీనితో ఇలా కాదని ఎలా అయినా సినిమా ఏంటో ప్రూవ్ చేయాలనీ.. శంకర్ గేర్ మార్చేందుకు రెడీ అవుతున్నాడు. దీపావళికి టీజర్‌ను రిలీజ్ చేసే టార్గెట్‌తో.. సాలిడ్ టీజర్ కట్‌పై ఫోకస్ పెట్టాడు. ప్రస్తుతం టీజర్ ఎడిటింగ్ పనులు జరుగుతున్నాయి. త్వరలో బిజినెస్ అగ్రిమెంట్స్ జరిగే టైం కాబట్టి.. ట్రేడ్‌లో జోష్ రావాలంటే టీజర్ పాత్ర చాలా ఉంటుంది. అసలు కథ ఇది అని తెలిస్తేనే ఆ రేంజ్‌లో బిజినెస్ కూడా జరుగుతుంది. ఈ క్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 150 కోట్ల థియేట్రికల్ బిజినెస్ ను ఆశిస్తున్నారు. జరిగిన బిజినెస్ కు తగిన రికవరీ రావాలంటే మాత్రం పోటీ తక్కువగా ఉండాలి. కానీ సంక్రాంతికి రిలీజ్ చేస్తున్నారు కాబట్టి కాంపిటీషన్ తప్పదు. విశ్వంభరతో రావాల్సిన చిరంజీవి డ్రాప్ అయ్యాడు. రేస్‌లో బాలకృష్ణ , వెంకటేష్, అజిత్, సందీప్‌కిషన్ లాంటి హీరోలు ఉన్నారు. వీరిలో ఎవరు తప్పుకుంటారు, ఎవరు ఉంటారనేది తేలాలంటే కాస్త టైమ్ పట్టేలా ఉంది. ఎలాగూ రామ్‌చరణ్‌కు గ్లోబల్ ఇమేజ్ ఉంది. కానీ అది కేవలం ఓవర్సీస్ మార్కెట్‌లో మాత్రమే వర్క్ అవుట్ అవుతుంది. లోకల్ మాస్ ఆడియన్స్ వరకు గేమ్ ఛేంజర్ చేరుకోవాలంటే మాత్రం.. ఆ రేంజ్ మాస్ కంటెంట్ పబ్లిక్‌లో చూపించాల్సిందే. ఇవన్నీ జరగాలంటే దానికి బలమైన పునాది టీజర్‌తోనే మొదలవుతుంది. ఒక్కసారి టీజర్ వదిలారంటే.. వెంటనే ప్రమోషన్స్ స్పీడ్ పెంచాల్సి ఉంటుంది. ఇక్కడ ఓ వైపు ఎలాంటి హడావిడి లేకుండానే పుష్ప-2 దుమ్ము దులిపేస్తుంది. అసలైన అప్డేట్ రాకుండానే వెయ్యి కోట్లకు పైగా ప్రీ రిలీజ్ జరిగిందన్న వార్త మీడియా, సోషల్ మీడియా అంతా కమ్మేసింది. అసలు ట్రైలర్ లేకుండానే పుష్ప-2 ఇలా రచ్చ చేస్తుందంటే.. ఈ బ్రాండ్ దేశవ్యాప్తంగా ఎలా పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. సేమ్ ఇలానే గేమ్ చెంజర్‌కు కూడా జరిగితే అదే పదివేలు అని మెగా ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఇంకా గేమ్ ఛేంజర్ సినిమా రిలీజ్‌కు 75 రోజుల సమయం మాత్రమే ఉంది. ప్రస్తుతం సాంగ్ రిలీజ్‌లు, టీజర్ కట్స్‌తో ఫస్ట్ గేర్ దగ్గర ఉన్న గేమ్ ఛేంజర్ బండి.. కనీసం టీజర్ రిలీజ్ తర్వాతైనా థర్డ్ గేర్‌కు వెళ్ళిపోయి స్పీడ్ పెంచుతుందేమో చూడాలి. ఇప్పటివరకు అయితే కథపై ఎలాంటి క్లారిటీ లేదు. టీజర్ తర్వాత శంకర్ ఎలాంటి క్లారిటీ ఇస్తాడా అని అభిమానులు ఎదురుచూస్తున్నారు.

## టాలీవుడ్‌లో సునామీ ఖాయం!



మా హీరో పాన్ ఇండియా స్టార్, మా హీరో గ్లోబల్ స్టార్.. బడా దర్శకుడు లేకపోయినా మా హీరోకు పాన్ ఇండియా క్రేజ్ ఉంది. నిజమే అభిమానులు చెప్పినట్లుగా హీరోలంతా అదే రేంజ్ లో ఉన్నారు. టాలీవుడ్ హీరోలు, సౌత్ ఇండియన్ హీరోలు ఎవరు లేరు. అందరు పాన్ ఇండియ హీరోలే ఉన్నారు. సినిమాల మార్కెట్ హీరోల ఇమేజ్‌ను బట్టి ఉంటుందనేది వాస్తవం. కానీ అదంతా ఒకప్పుడు, ఇప్పుడు అలా లేదు. వీరంతా పాన్ ఇండియా లెవెల్ లో హిట్స్ కొట్టడం వెనుక డైరెక్టర్స్ పాత్ర చాలా ఉంటుంది. ఒకసారి కోట్లలో వసూళ్లు వచ్చాయంటే.. ఇక తర్వాత సినిమా మీద కూడా అదే అంచనాలు కొనసాగుతూ ఉంటాయి. అందుకే ఇప్పుడు ప్రభాస్, ఎన్టీఆర్ , చరణ్, బన్నీ ముందు వేల కోట్ల టార్గెట్స్ ఉన్నాయి. అయితే వీరిపై ఎంత భారం ఉందో.. అంతకుమించిన భారం ఇప్పుడు దర్శకుల మీద పడుతుంది.

పాన్ ఇండియా ట్రెండ్‌లో భారీ బడ్జెట్ సినిమాలను రూపొందిస్తున్నారు దర్శకులు. ఒకరికి మించి ఒకరు బడ్జెట్ ను పెంచేస్తున్నారు. మరి అంత బడ్జెట్ కేటాయించినప్పుడు.. ఆ రేంజ్ వసూళ్లను సాధించాల్సిన బాధ్యత కూడా వారి మీదే ఉంది. అలా వేల కోట్ల టార్గెట్‌తో బరిలోకి దిగుతున్నారు తెలుగు డైరెక్టర్స్. తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీలో సునామి సృష్టించడానికి రెడీ అవుతున్నారు. అసలు భారీ బడ్జెట్ సినిమా అనగానే ముందుగా అందరికి గుర్తొచ్చేది రాజమౌళి. బాహుబలితో రికార్డ్స్ బ్రేక్ చేసి..



ఆర్ఆర్ఆర్ తో ఆస్కార్ అందుకుని.. ఇప్పుడు ఒక్కో సినిమాకు మెరుగులు దిద్దుతూ.. బడ్జెట్‌ను పెంచుకుంటూ వెళ్తున్నాడు. అలా ఇప్పుడు మహేష్‌తో ఓ ప్రాజెక్ట్‌కు ఏకంగా 2000 కోట్ల భారీ బడ్జెట్‌ను ప్లాన్ చేస్తున్నాడు జక్కన్న. సో దానికి తగినట్లు రికవరీ చేయాల్సిన బాధ్యత కూడా ఆయనే మీదే ఉంది. ఇక ఆ తర్వాత ఇదే రేంజ్ లో భారీ బడ్జెట్ సినిమాలను తీస్తున్న దర్శకుడు ప్రశాంత్ నీల్. ప్రస్తుతం ప్రశాంత్ నీల్ ఎన్టీఆర్‌తో ఓ సినిమాను తీస్తున్న సంగతి తెలిసిందే. అది కాకుండా ఈ దర్శకుడి చేతిలో ప్రభాస్ సలార్ 2 సినిమా బాధ్యత కూడా ఉంది. ఈ రెండు దాదాపు 1000 కోట్ల మార్కెట్ ఉన్న ప్రాజెక్ట్స్. కాబట్టి ప్రశాంత్ నీల్ కూడా ఈ భారం మోస్తున్నట్లే.

ఇక ఈ రెండు సినిమాల అంత కాకపోయినా.. ప్రస్తుతం లెక్కల మాస్టారు సుకుమార్ కూడా వేల కోట్ల భారాన్ని మోస్తున్నాడు. రిలీజ్‌కు చాలా దగ్గరిలో ఉన్న మూవీ పుష్ప 2. ప్రస్తుతం ఈ సినిమాపై అందరికి భారీ అంచనాలు నెలకొన్నాయి. కనీసం 1200 నుంచి 1300 కోట్ల టార్గెట్ సుకుమార్ కళ్ళ ముందు ఉంది. ఇక వీరు కాకుండా సందీప్ రెడ్డి వంగ , ప్రశాంత్ వర్మ లాంటి డైరెక్టర్స్ కూడా భారీగానే ప్లాన్ చేస్తున్నారు. అయితే సౌత్ లో ఇంత మంది పేర్లు మోత మోగిపోతుంటే.. నార్త్‌లో మాత్రం కేవలం అయాన్ ముఖర్జీ పేరు మాత్రమే వినిపిస్తుంది. బాలీవుడ్ కాస్త నిలదొక్కుకోవాలంటే ఈ సినిమా 1000 కోట్ల మార్క్‌ను దాటాల్సిందే.





- ఐ డ్రీమ్ సౌజన్యంతో...



# చికాకులో పెట్టిన ట్వీట్!

ఎలాన్ మస్క్ 2016 డిసెంబర్‌లో తన కార్‌లో లాస్ ఏంజెల్స్‌లో ప్రయాణిస్తున్నాడు. అలా వెళ్తూ ట్రాఫిక్‌లో చాలాసేపు ఇరుక్కుపో -యాడు. ఆ చికాకులో ఒక ట్వీట్ చేశాడు. ఈ ట్రాఫిక్‌తో నాకు పిచ్చి లేస్తుంది. నేను ఒక టన్నెల్ బోరింగ్ మెషిన్‌ను డెవలప్ చేసి.. తవ్వడం స్టార్ట్ చేస్తా అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నాడు. చాలామంది ఈ ట్వీట్ చూసి నవ్వుకున్నారు. ఎలన్ జోక్ చేస్తున్నాడని భ్రమపడ్డారు. ట్రాఫిక్‌లో పది నిమిషాలు ఇరుక్కొని ఏదేదో మాట్లాడుతు న్నాడని భావించారు. కట్ చేస్తే.. ఆ ట్వీట్ చేసిన రెండు వారాల తర్వాత 'ది బోరింగ్ కంపెనీ'ని స్టార్ట్ చేశాడు. ఈ కంపెనీ లక్ష్యం ఏంటంటే.. పెద్ద నగరాల్లో అండర్ గ్రౌండ్ టన్నెల్స్ నెట్‌వర్క్‌ను నిర్మించడం. అదే విషయాన్ని బోరింగ్ కంపెనీ ఆవిర్భావం రోజు చెప్పాడు. ఎలాన్ చేస్తున్న దాన్ని చూసి వాల్‌స్ట్రీట్‌లో నవ్వుకున్నారు. ఇదంతా డిస్ట్రాక్షన్ కోసం చేస్తున్నాడని, ఇదొక పబ్లిక్ స్టంట్ అని వ్యాఖ్యానించారు. కానీ ఎలాన్ మస్క్ తన పని తాను చేసుకొని పోయాడు. వాళ్లెవ్వరూ చూడనిది మస్క్ చూశాడు.

అప్పుడు గానీ.. ది బోరింగ్ కంపెనీ అనేది జోక్ కాదని.. మస్క్ దీన్ని చాలా సీరియస్‌గా తీసుకున్నాడని నమ్మడం మొదలుపెట్టారు. ఎలాన్ మస్క్ బోరింగ్ కంపెనీపై వాల్‌స్ట్రీట్ ట్రేడర్స్ దృష్టి పెట్టడం మొదలుపెట్టారు.

2021లో మస్క్ కంపెనీ 675 మిలియన్ డాలర్లను సేకరించింది. అప్పట్లో ది బోరింగ్ కంపెనీ వాల్యూ 5.7 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు. 2023కు వచ్చేసరికి మస్క్ బోరింగ్ కంపెనీ వాల్యూ 12.7 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇంత వేగంగా కంపెనీ వాల్యూ ఎలా పెరిగిందని అనుకుంటున్నారా?



# 12.7 మిలియన్ డాలర్ల కంపెనీగా మారింది!

ది బోరింగ్ కంపెనీ భవిష్యత్ ఏంటో మస్క్‌కు క్లియర్‌గా తెలుసు. ఆ రోజు లాస్ ఏంజెల్స్‌లో 300 మిలియన్ డాలర్లు పెట్టి తవ్విన టన్నెల్ విలువ ఈ రోజు 100 బిలియన్ డాలర్లు. ఎస్.. మీరు విన్నది కరక్టే. అది మస్క్ మ్యాజిక్ అంటే. చాలా దశాబ్దాలుగా టన్నెల్ బోరింగ్ మెషిన్లు ఎలాంటి మార్పులు లేకుండానే పని చేస్తున్నాయి. బోరింగ్ ఇండస్ట్రీ కూడా అందులో మార్పులు చేయాలని భావించలేదు. అంతే కాకుండా ఈ టన్నెల్ బోరింగ్ మెషిన్లు చాలా నెమ్మదిగా పని చేస్తాయి. వీటికి అయ్యే ఖర్చు కూడా చాలా ఎక్కువ. కానీ.. ఎలాన్ మస్క్ మాత్రం ఈ బోరింగ్ మెషిన్లను.. టెక్నాలజీ ఉపయోగించి మార్పులు చేయగలనని నమ్మాడు. వేగంగా, చౌకగా పని చేసే మెషిన్లను తయారుచేయాలని డిసైడ్ అయ్యాడు. దీంతో ఒక పాత బోరింగ్ మెషిన్‌ను కొని, దాని మీద ప్రయోగాలు చేయడం మొదలు పెట్టాడు.

2017లో ది బోరింగ్ కంపెనీ 112.5 మిలియన్ డాలర్లు సేకరించింది. ఇందులో 100 మిలియన్ డాలర్లు మస్క్ స్వంతగా పెట్టినవే. మిగిలిన 12.5 మిలియన్ డాలర్లను ఎలాన్ మస్క్ 20 వేల ఫ్లేమ్త్రోవర్స్‌ను అమ్మి సేకరించాడు. ఇదంతా గమనిస్తున్న వాల్‌స్ట్రీట్.. మస్క్‌కు నిజంగానే మతిపోయింది.. అసలు ఏం చేస్తున్నాడో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించింది. ఎలాన్ మస్క్ చేస్తున్న దాన్ని ప్రతీ ఒక్కరు విమర్శిస్తూనే ఉండగా.. 2018లో ది బోరింగ్ కంపెనీ తొలి టన్నెల్‌ను తవ్వేసింది. లాస్ ఏంజెల్స్‌లోని హాత్రోన్‌లో కేవలం మైలుకు 10 మిలియన్ డాలర్ల ఖర్చుతో ఈ టన్నెల్ పూర్తిచేసింది. సాధారణంగా ఈ టన్నెల్ తవ్వాలంటే మైలుకు ఒక బిలియన్ డాలర్లు ఖర్చు అవుతాయి. కానీ 99 శాతం ఖర్చు తగ్గించి టన్నెల్ పూర్తి చేశాడు. సాధారణ టన్నెల్స్ కంటే మస్క్ తవ్విన టన్నెల్ సైజు తక్కువే. కానీ వాటిని రవాణాతో పాటు అనేక ప్రయోజనాలకు ఉపయోగించొచ్చు. మస్క్ స్థాపించిన ది బోరింగ్ కంపెనీకి 2019లో కాంట్రాక్ట్ లభించింది. లాస్ వేగస్‌లోని కన్వెన్షన్ సెంటర్ కింద ట్రాన్స్‌పోర్టేషన్ సిస్టమ్ కోసం టన్నెల్ తవ్వాలని కాంట్రాక్ట్ వచ్చింది. ఈ కాంట్రాక్ట్ విలువ 48.7 మిలియన్ డాలర్లు. 2021లో ఈ టన్నెల్ పూర్తి చేశాడు.




ది బోరింగ్ కంపెనీ అనేక వందల యుటిలిటీ టన్నెల్స్‌ను తవ్వింది. ఈ టన్నెల్స్ ఇళ్లకు నీటి సరఫరా చేసే పైపులు, ఎలక్ట్రికల్ కేబుల్స్, ఇంటర్నెట్ ఫైబర్ కేబుల్స్ వంటివి ఈజీగా అండర్ గ్రౌండ్‌లో వేసుకోవడానికి పనికి వస్తాయి. అనేక నగరాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఇలాంటి టన్నెల్స్ ఉపయోగపడతాయి. భవిష్యత్‌లో ఇలాంటి టన్నెల్స్‌కు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతుంది. కానీ మస్క్ కంపెనీ ఆల్రెడీ అలాంటి వాటిపై దృష్టి పెట్టింది. ఇప్పటికే ది బోరింగ్ కంపెనీ లాస్ వేగస్, టెక్సాస్, ఫ్లోరిడా నగరాల్లో ప్రాజెక్ట్స్ చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా మరికొన్ని నగరాల్లో ప్రాజెక్టుల కోసం ప్రయత్నిస్తోంది. ఒకరోజు ట్రాఫిక్‌లో ఇరుక్కొని చేసిన ట్వీట్‌ను.. 12.7 బిలియన్ డాలర్ల కంపెనీగా మార్చడం ఒక్క మస్క్‌కే సాధ్యమయింది. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది బిలియనీర్లు ఉన్నారు. కానీ తమ ఆలోచనలను వేగంగా.. విజయవంతమైన రూట్లోకి తీసుకెళ్లగలిగేవాడు మస్క్ ఒక్కడే అనుకుంటా.

**- భాయ్‌జాన్**

## నిజమైన లబ్ధిదారులకి అందేలా చూడండి

- హుద్‌హుద్ ఇళ్ల పరిసరాలు ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి
- జంగిల్ క్లియరెన్స్ చేసి నిఘా ఏర్పాటుచేయాలి
- గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇంకా అర్హులకు అందలేదు
- మున్సిపల్ కమిషనర్‌కు జనసైనికుల ఫిర్యాదు



(సత్యంన్యూస్, పలాస)

2014 అక్టోబర్‌లో వచ్చిన హుద్‌హుద్‌తో చాలామంది బతుకులు చిన్నాభిన్నం అయ్యాయని, భారీనష్టం చవిచూసి ఇళ్లు పోగొట్టుకుని రోడ్డుపై పడిన బాధితుల పరిస్థితులు చూసి చలించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు విన్నపం మేరకు తక్షణ సహాయంగా నిధులు విడుదల చేశారని, అయితే పక్కా ఇళ్లు నిర్మించినా గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో అర్హులకు ఇంకా అందలేదని జనసేన నాయకులు అన్నారు. ఈమేరకు అసలైన లబ్ధిదారులకు హుద్‌హుద్ ఇళ్లు అందేలా చూడాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అలస్యం వల్ల భారీగా ప్రజాధనం వృధా అవ్వడమే కాక, ఇప్పుడు పునర్నిర్మాణం కోసం అదే నిర్మాణ నిధులను కేటాయించే పరిస్థితి వచ్చిందని, భవిష్యత్తులో ఎటువంటి అభ్యంతరాలు ఎవ్వరి నుంచి ఎదుర్కోకుండా ఇప్పుడు కేటాయింపులో పారదర్శకతను చూపడం ద్వారా మరింత నష్టాన్ని నివారించగలమని జనసేన నేతలు కోరారు. ప్రజల నుంచి బహిరంగ అప్లికేషన్స్ తీసుకుని వాటిని పరిశీలించిన తర్వాత లాటరీ సిస్టం ద్వారా అర్హత ద్వారా పంపిణీ జరపాలని కోరారు. బొడ్డపాడు లిమిట్స్‌లో హైవే మీద ఉన్న స్మార్ట్ టౌన్‌షిప్ సైట్లు కేటాయించే విధంగా హుద్‌హుద్ ఇళ్లు కూడా ప్రజలకు పారదర్శకంగా కేటాయించాలని వారు కోరారు. ప్రస్తుతం అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా హుద్‌హుద్ ఇళ్లు నిర్మించిన ప్రాంతం మారిందని, అక్కడ జంగిల్ క్లియరెన్స్ చేపట్టి భద్రతా నిఘాలో పెట్టేలా చర్యలు చేపట్టాలని జనసైనికులు కమిషనర్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యక్రమల కమిటీ సభ్యులు లైసెట్టి గిరీష్, జనసేన పార్టీ యువ నాయకుడు శంకు శ్రీకాంత్, జనసేన పార్టీ పలాస నియోజకవర్గ నాయకులు కేదార్నాథ్ బంగారి, పలాస ప్రభుత్వ పాఠశాల ఎస్ఎంసీ వైస్ చైర్మన్ దీనా జ్యోతి పాత్రో, సర్వవరపు ప్రదీప్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## అంగవైకల్య వృద్ధునికి అండగా చిన్నారులు

* కిడ్డీబ్యాంకులో దాచుకున్న డబ్బులతో చేతికర్రలు అందించారు
* అభినందించిన రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాజాం కాగితాపల్లికి చెందిన లావేటి దుర్గ వెంకట నారాయణబాబు కుమారుడు లావేటి ధనిష్, కుమార్తె లావేటి పల్లవిలు తాము దాచుకున్న డబ్బులతో శ్రీకాకుళం నగరంలో రాయివీధికి చెందిన అంగవైకల్య నిస్సహాయ తవుడు అనే వృద్ధునికి చేతికర్రలను అందించి అందరి మనసులను దోచుకున్నారు. వృద్ధుని బాధను తండ్రి నారాయణబాబు, తల్లి లిల్లీ ఎమెర్జెన్సీ బ్లడ్ సర్వీస్ వాట్సాప్ స్టేటస్ ద్వారా తెలుసుకొని పిల్లల కోరిక మేరకు వారు దాచుకున్న డబ్బులతో అందించారని ఎమెర్జెన్సీ బ్లడ్ ఫౌండర్ నంది ఉమాశంకర్ తెలిపారు. తల్లి లిల్లీ మాట్లాడుతూ చిన్ననాటి నుండే



సామాజిక బాధ్యతను పిల్లలకు అలవాటు చేస్తే, భవిష్యత్ తరానికి సేవా తత్పురుషులౌతారని అన్నారు. శుక్రవారం స్థానిక రెడ్‌క్రాస్ కార్యాలయ ప్రాంగణంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహన్‌రావు చేతుల మీదుగా వృద్ధునికి చేతికర్రలను అందించి, చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ ఫౌండర్ నంది ఉమాశంకర్, రెడ్‌క్రాస్ ప్రతినిధి, నెహ్రూ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్య, యోగ రామారావు, ప్రభాస్ ఫ్యాన్స్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## పశుగణనకు సహకరించండి

- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
- కిష్టప్పపేటలో పశుగణన పోస్టర్ ఆవిష్కరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

దేశవ్యాప్తంగా ఈ నెల 25వ తేదీ నుంచి 2025 ఫిబ్రవరి 25 వరకు 21వ అఖిల భారత పశుగణన చేపట్టేందుకు పశు సంవర్ధక శాఖ సిద్ధమైందని, విషయ సేకరణదారులు వచ్చే సమయంలో పశువులు, కోళ్ల సంఖ్యపై సరైన సమాచారాన్ని అందించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. కిష్టప్పపేటలో పశుగణన పోస్టర్‌ను ఎమ్మెల్యే గొండు శంకర్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ భారతదేశంలో పశువుల పెంపకం కీలకమైన ఆర్థిక వనరు అని, ఇది జాతీయ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి గణనీయంగా దోహదపడుతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలకు పశుపోషణ అదనపు ఆదాయాన్ని అందిస్తుందని తెలిపారు. భూమిలేని కుటుంబాలకు ప్రాథమిక జీవనోపాధిగా పని చేస్తుందని, పశుపోషణ ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలు, సంక్షోభ సమయాల్లో గ్రామీణ ప్రాంతాలలో కీలకమైన ఆదాయ వనరుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక సహాయ సంచాలకులు డాక్టర్ పీఎస్‌జీ బాలకృష్ణ, వీపీసీ వై.వి.కృష్ణారావు, స్థానిక పశువైద్యాధికారి తిరుపతిరావు, అరసవల్లి, కళింగపట్నం పశువైద్యాధికార్లు డాక్టర్ దిలీప్, జ్యోత్న్న, పశుసంవర్ధక సహాయ సిబ్బంది అజిత్, మోహన్, అర్జున్, మధు, సర్పంచ్ అరసవల్లి సత్యవతి పాల్గొన్నారు.


























# సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్

**- వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే గొండు శంకర్**

**- గార ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ**



(సత్యంన్యూస్, గార)

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బారు కార్యక్రమం నిర్వహిస్తున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ప్రజాదర్బార్‌లో భాగంగా మండల పరిధిలో గల ప్రజల నుంచి శుక్రవారం వినతులు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యపాలన కారణంగా గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయన్నారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్తు వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా నోచుకోకపోవడంతో ప్రజలు దుర్భర పరిస్థితిలో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే 15వ ఆర్థికసంఘం నిధులను గ్రామ పంచాయతీలకు విడుదల చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఒకే రోజులో వేలాదిగా గ్రామసభలు నిర్వహించి పల్లెల్లోని సమస్యలను గుర్తించామన్నారు. ప్రాధాన్యత క్రమంలో ఆయా సమస్యల పరిష్కారానికి పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శంకుస్థాపనలు నిర్వహించినట్లు గుర్తు చేశారు. త్వరలోనే గ్రామాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టి పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొనే దిశగా కొనసాగుతామన్నారు. ప్రజా దర్బారు కార్యక్రమానికి వేలాదిగా వినతులు వస్తుండడం చూస్తుంటే గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్య ధోరణి కి నిదర్శనంగా నిలుస్తోందని పేర్కొన్నారు. సీఎం నారా చంద్రబాబునాయుడు తోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని చెప్పారు. ఒక్క ఛాన్స్ ఇచ్చిన పాపానికి జగన్ రెడ్డి రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లారని విమర్శించారు. రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను నాశనం చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని చెప్పారు. గ్రామ స్వరాజ్య పాలన కోసం గాంధీజీ కలలు కన్నా ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో గార మండల టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అధికారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# టీడీపీ సభ్యత్వంతో భరోసా



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

టీడీపీ సభ్యత్వంతో కుటుంబమంతా భరోసా పొందవ చ్చని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు పీఎంజే బాబు అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 26 నుంచి జిల్లాలోని అన్ని గ్రామాల్లో తెలు గుదేశం సభ్యత్వం నమోదు కార్యక్రమం పండగ వాతావర ణంలో నిర్వహించబడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాత సభ్యత్వం రెన్యూవల్, కొత్త సభ్యత్వం నమోదు చేసుకోవచ్చున్నారు. 18 ఏళ్లు నిండిన టీడీపీ అభిమానులు , రాష్ట్ర అభివృద్ధి కోరుకునే వారు అందరూ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. సభ్యత్వం నమోదు కొరకు ఓటర్ ఐడి, ఆధార్ నెంబర్, ఫోటో, ఫోన్ నెంబర్ అవసరమన్నారు. సభ్యత్వం నమో దు కోసం రూ.100లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. జీవితకాల సభ్యత్వం కావాలంటే రూ. లక్ష చెల్లించాలన్నారు. వాట్సప్ యాప్, టెలిగ్రామ్ బాట్, వెబ్సైట్ ద్వారా సభ్యత్వం నమోదు చేసుకోవ చ్చున్నారు. గతంలో ఉన్న రూ.2లక్షల ప్రమాద భీమా మొత్తాన్ని రూ.5లక్షలకు పెంచామన్నారు. మట్టి ఖర్చులు కింద రూ.10వేలు ఇవ్వనున్నట్టు తెలిపారు. అదేవిధంగా సభ్యత్వం తీసుకున్న కుటుంబ సభ్యులకు విద్య, వైద్యం, ఉపాధి కల్పన కోసం నైపుణ్య శిక్షణ ఇప్పిస్తా మన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో యూనిట్ ఇంఛార్జీలు, క్లస్టర్ ఇంఛార్జీలు, పార్టీ శ్రేణులు అందరూ ముమ్మరంగా పాల్గొని విజయవంతం చేసి రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లాను అగ్ర స్థానంలో ఉంచడానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.


## అద్దెకొరకు

**శ్రీకాకుళంలో డే అండ్ నైట్ జంక్షన్ వద్ద గల లయా ల్యాబ్ బిల్డింగ్‌లోని సెకండ్ ఫ్లోర్, థర్డ్ ఫ్లోర్ (22X150) కామన్ హాల్ మెడికల్ హోల్‌సేల్ షాపులకు గాని, డాక్టర్ ప్లాజాకు గాని, ఆఫీసులకు గాని అద్దెకు ఇవ్వబడును.**

- సంప్రదించగలరు -

**94403 72300, 98487 96626**


# చిల్లర తమ్ముళ్లది.. పెద్దనోట్లు వైకాపావి!

(మొదటిపేజీ తరువాయి)

వద్ద పల్లెవలస రోడ్డులో ఉన్న గంగమ్మ స్టోన్‌క్రషర్ వద్ద డంపింగ్ చేస్తున్నారు. ఇక్కడ నుంచి రాత్రివేళల్లో విశాఖకు ఇసుకను తరలిస్తున్నారు. ఈ వ్యవహారంలో శిలగాం సింగువలసకు చెందిన కంచు శ్రీను ప్రధాన పాత్ర పోషిస్తున్నట్టు తెలిసింది. వైకాపా సానుభూతిపరుడుగా ఉన్న శ్రీనుకు ఇసుక డంపింగ్ చేసి అక్రమంగా లారీల్లో విశాఖకు తరలించడానికి స్థానిక టీడీపీ నాయకులు పూర్తి సహకారాలు అందిస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. మరో డంప్‌ను రంధి అప్పలస్వామి అలికాంలోని ఆయన సొంత స్థలంలోనే ఏర్పాటు చేసుకున్నారు. నైరా దాటిన తర్వాత అలికాం రోడ్డు పక్కనే పట్నాల కృష్ణ ఒక ఇసుక డంప్‌ను ఏర్పాటు చేశారు. దీంతోపాటు రోణంకి బస్టాప్ పక్కన మరో ఇసుక డంపింగ్ చేసి రాత్రి సమయంలో లారీల్లో విశాఖకు తరలించుకుపోతున్నారు. ఇసుక డంపింగ్ పాయింట్లన్నీ బైరికి చెందిన పట్నాల కృష్ణ నేతృత్వంలో నడుస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు.

గృహావసరాలకు ఇసుక అవసరమయ్యే వారు సచివాలయంలో పేరు నమోదు చేసుకొని అక్కడ సిబ్బంది ఇచ్చే అనుమతితో ఇసుకను ట్రాక్టర్లు, నాటుబళ్లతో తరలించాలి. అలాంటి ప్రక్రియ జిల్లాలో ఎక్కడా జరగడం లేదు. జిల్లా అంతటా ఇసుక అక్రమ రవాణా సాగుతున్నా శ్రీకాకుళం పరిధిలో అంతకుమించి సాగుతుంది. ఇసుక వనరులు అధికంగా ఉండడం, నదిలో ఇసుక లభ్యత లేకపోయినా తవ్వేయడం, నదీ పరివాహక ప్రాంతం ఎక్కువ ఉండడం వల్ల నదికి ఆనించి ఉన్న ప్రతి గ్రామం వద్ద అనధికారిక రీచ్‌లు ప్రారంభమయ్యాయి.

ప్రభుత్వం నామినేషన్ పద్ధతిలో ఇసుకను తవ్వేందుకు అనుమతులు ఇవ్వడంతో ఈ దందా మరింత జోరుగా సాగుతుంది. అనధికారిక రీచ్‌లు తెరిచినట్టు ఉన్నతాధికారులకు సమాచారం, ఫిర్యాదులు వస్తున్నా ఏమీ చేయలేని పరిస్థితి. ఇందుకు చంద్రబాబు ప్రకటనే కారణమని అధికారులు చెబుతున్నారు. సొంత అవసరాల కోసం ఇసుకను ట్రాక్టర్లు, నాటుబళ్లపై తరలించేవారిని అడ్డుకుంటే చర్యలు తీసుకుంటామని ప్రకటించి రెవెన్యూ, మైన్స్, పోలీసు అధికారుల చేతులు కట్టేశారు. చంద్రబాబు ప్రకటనపై తర్వాత మార్గదర్శకాలు వచ్చినా అధికారులెవరూ ఇసుకను అక్రమంగా తరలించేవారిని అడ్డుకునే సాహసం చేయడంలేదు. దీంతో రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుకను ట్రాక్టర్లలో తరలించి డంపింగ్ చేసి, అక్కడి నుంచి లారీల్లో విశాఖకు తరలిస్తున్నారు.

బైరిలో వద్ద మడపాం బ్రిడ్జ్ కింద గురువారం జేసీబీతో ఇసుకను తవ్వి లోడ్‌చేస్తున్న సమయంలో రెవెన్యూ, పోలీసులు కలిసి పట్టుకొని మైన్స్ అధికారులకు తదుపరి చర్యల కోసం విన్నవించారు. దీనిపై మైన్స్ అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని సమాచారం. ఇసుక తవ్వకాలు జరిపి అక్రమంగా రవాణా చేస్తున్న వారంతా పోలీసులకు మామూళ్లు ఇస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. ప్రతివారం అందరూ కలిపి ఒక్కో గ్రామం నుంచి రూ.30వేలు పోలీసులకు ఇస్తున్నట్టు ప్రచారం సాగుతుంది. దీన్ని వసూలు చేయడానికి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆయా గ్రామాలకు చెందిన దత్తత కానిస్టేబుల్స్ ఈ బాధ్యత చూస్తున్నట్టు ఆయా గ్రామాల్లో చర్చ సాగుతుంది. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌కు ఇసుక అక్రమ రవాణా తలనొప్పిగా మారిపోయిందని పార్టీలోనే చర్చ సాగుతుంది. అక్రమ తవ్వకాలు చేయొద్దని పార్టీ నాయకులు, కార్యకర్తలను వారిస్తున్నా అందరూ ఎమ్మెల్యే మాటను బేఖాతరు చేస్తున్నారు. పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు కలిసి ఇసుక అక్రమ వ్యాపారం చేస్తున్నారు. దీనికి తోడు టీడీపీలో ఉన్న రెండు వర్గాల మధ్య ఆధిపత్యపోరు కారణంగా ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ఇసుక అక్రమ రవాణా అడ్డుకొనే ప్రయత్నం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అధికారులెవరూ స్పందించడం లేదు. నదికి సమీపంలో ఉన్న వారందరూ ఒక్కో ఇంటో రెండు అంతకంటే ఎక్కువ ట్రాక్టర్లు కలిగి ఉండటంతో రేయింబవళ్లు వారంతా ఇసుక వ్యాపారంలో నిమగ్నమై ఉన్నారు.

# గంజాయి సేవిస్తూ పోలీసులకు చిక్కిన యువకులు..!

(మొదటిపేజీ తరువాయి)

సంబంధాలపై శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద ఆధ్వర్యంలో విచారణ చేస్తున్నట్టు తెలిసింది. వీరితో పాటు ఇంకెవరైనా గ్రామంలో గంజాయి సేవించేవారు ఉన్నారా, ఉంటే వారిని గుర్తించి అందరినీ రీహేబిటేషన్ సెంటర్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇవ్వాలని పోలీసులు ఆలోచన చేస్తున్నట్టు తెలిసింది. గంజాయిని సేవిస్తూ పోలీసులకు చిక్కిన ముగ్గురు యువకులు ఫరీద్‌పేటకు చెందిన



వారని తేలడంతో గ్రామంలో యువత ఉలిక్కిపడింది. ఇప్పటికే జిల్లాలో రోజుకో గంజాయి కేసు నమోదవుతుండడం, గంజాయి సేవించేవారిలో యువతే ఎక్కువ మంది ఉన్నట్టు పోలీసులు గుర్తించడంతో అందరిలో కలవరం ప్రారంభమైంది. ప్రస్తుతం అదుపులో ఉన్న యువకుల నుంచి మరింత సమాచారాన్ని రాబట్టే ప్రయత్నంలో పోలీసులు నిమగ్నమయ్యారు. పోలీసుల చెరలో ఉన్నవారిని విడుదల చేయించడానికి రాజకీయ ప్రయత్నాలు ప్రారంభమయినట్టు విశ్వసనీయ సమాచారం.

## సొంత నిధులతో జంగిల్ క్లియరెన్స్



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ఎచ్చెర్ల మండల కేంద్రంలో ఉన్న స్మశాన వాటికకు వెళ్లే రోడ్డు మార్గం పిచ్చి మొక్కలతో అధ్వానంగా తయారయింది. గ్రామంలోని ఓ వ్యక్తి మరణించడంతో దహన సంస్కారాలకు అనేక అవస్థలు పడ్డారు. ఈ విషయాన్ని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, రిటైర్డ్ వీఆర్వో జరుగుళ్ల వెంకటరమణ దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన తన సొంత నిధులతో జంగిల్స్ క్లియరెన్స్ పనులను శుక్రవారం చేపట్టారు. సొంత నిధులతో జంగిల్ క్లియరెన్స్ చేయించిన ఆయనకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉచిత యోగ శిక్షణా తరగతులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రెడ్‌క్రాస్ పరిపాలన విభాగంలో ఉచిత యోగ శిక్షణా తరగతులను ప్రారంభించామని రెడ్‌క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ యోగ గురువు రామారావు పర్యవేక్షణలో యోగ శిక్షకురాలు ఎం.గాయత్రీ తరగతులను నిర్వహిస్తారని పేర్కొన్నారు. శుక్రవారం మహిళల యోగ తరగతులు ప్రారంభించినట్టు తెలిపారు. రానున్న రోజుల్లో పురుషుల యోగ తరగతులను నిర్వహిస్తామన్నారు. ఉచిత యోగ కొరకు యోగ శిక్షకురాలు ఎం.గాయత్రీని 9493043999లో సంప్రదించాలన్నారు. యోగ గురువు రామారావు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు రెండేళ్ల నుంచి ఉచితంగా యోగ తరగతులను నిర్వహంచడానికి చేసిన ప్రయత్నాలు ఇప్పటికి సాకారమైందని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోశాధికారి కనుగుల దుర్గ శ్రీనివాస్, వైకుంఠరావు, బి.సతీష్, బెజ్జిపురం యూత్‌క్లబ్ ప్రసాదరావు, స్వీప్ రమణమూర్తి, కళ్యాణ్, నరసింగరావు, పెంకి చైతన్య, గొలివి రమణ, గుణాకర్‌రావు, చిన్మయరావు, సుజాత, నంది ఉమాశంకర్, అయేషా బేగం, యోగ నేర్చుకోవటానికి వచ్చిన మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



# దీపావళి నుంచి మూడు సిలిండర్లు

**- జనవరిలో అమ్మకు వందనం**

**- పశుగణను ప్రారంభించిన మంత్రి అచ్చెన్నాయుడు**



(సత్యంన్యూస్, టెక్కలి)

దీపావళి నుంచి అర్హులైన ప్రతి కుటుంబానికి ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు అందించనున్నట్టు వ్యవసాయ, పశుసంవర్ధక శాఖా మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. కోటబొమ్మాళి మండలం పెద్ద బమ్మిడిలో శుక్రవారం పశుగణనను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 21వ అఖిల భారత పశుగణనలో భాగంగా శుక్రవారం నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు రాష్ట్రంలోని 1.50 కోట్ల కుటుంబాలకు చెందిన పశు వుల వివరాలను నమోదు చేయనున్నటు తెలిపారు పశుగణనలో వ్యవసాయ పరికరాల వివరాలనూ సేకరిస్తారని, గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, భూమిలేని కుటుంబాలకు ప్రధాన ఆదాయవనరుగా ఉన్న పశుసంవర్ధక రంగాన్ని మెరుగుపరచడానికి అవసరమయ్యే నిధులు, పథకాల రూపకల్పన, అమలు, పర్యవేక్షణకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 17,244 గ్రామాలు, పట్టణాల్లోని 3,929 వార్డుల్లో గృహ, గృహేతర వ్యక్తుల నుంచి వివరాలు తీసుకుంటారని, ఇందు కోసం 5,390 మంది సిబ్బంది, 1,237 మంది పర్యవేక్షకులు, 45 మంది స్క్రూటినీ అధికారులు, ఇతర సిబ్బంది ఇందులో పాల్గొంటున్నారని వివరించారు. వీరికి ట్రావెలింగ్ కిట్లు, 60వేల గోడపత్రికలు, 1.50కోట్ల గృహ స్టిక్కర్లు, 8వేల ఐడీ కార్డులు అందించామని పేర్కొన్నారు. పశుగణన పూర్తయిన ఇంటి తలుపుపై స్టిక్కర్ వేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని, దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నామన్నారు. దీపావళి నుంచి ఏటా మూడు సిలిండర్లు ప్రతి నాలుగు నెలలకు ఒకటి చొప్పున ఇస్తున్నామని ప్రకటించారు. అమ్మకు వందనం జనవరి నెలలో ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కూడా వీలైనంత త్వరగా ఇచ్చేందుకు చర్చలు తీసకుంటున్నట్టు తెలిపారు. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.మురళీధర్, డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వి.జైరాజ్, జిల్లా జనాభా లెక్కల నోడల్ అధికారి డాక్ట ర్ జి.నారాయణరావు, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.లోకనాథం, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఎం. ప్రజ్ఞాచైతన్య, పశుసంవర్ధక సహాయకుడు, సెన్సస్ ఎన్యుమరేటర్ ఎం. బలరాం, మాజీ ఎంపీటీసీ రామకృష్ణ, వెలమ విజయలక్ష్మి, పూజారి శైలజ, మాజీ సర్పంచ్ శిమ్మ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# దేశ ప్రగతిలో విద్యార్థులు నైపుణ్యం కీలకం

**- బీసీడీఈ సమన్వయకర్త ప్రొఫెసర్ అజయ్‌కుమార్**



(సత్యంన్యూస్, నరసన్నపేట)

దేశ ప్రగతిలో విద్యార్థుల నైపుణ్యం ఎంతో కీలకమని స్థానిక యూనివర్సిటీ బీసీడీఈ సమన్వయకర్త ప్రొఫెసర్ అజయ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి బీసీడీఈ (బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్మెంట్ త్రూ ఎడ్యుకేషన్), అంబేద్కర్ యూనివర్సిటీ సంయుక్తంగా పద్మావతి డిగ్రీ కళాశాలలో లిప్ (లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాం)పై విద్యార్థులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల వల్ల సామాజిక సేవ మెరుగ్గా జరుగుతుందని, విద్యార్థులు తలుచుకుంటే దేశం ప్రగతి పథంలోకి వెళ్లటం తథ్యమన్నారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యత పెంపొందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు చేపడుతుందని, ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు చదవడం, రాయడం తదితర సామర్థ్యాలను పెంచేలా ప్రణాళిక రూపొందించామని, విద్యార్థులు అది అమలు చేయాలని సూచించారు. శిక్షణ ఫౌండేషన్ ప్రతినిధి అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తినిస్తాయని, విద్యార్థుల కనీస సామర్థ్యాలు పెంచడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కళాశాల డైరక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ చదువు, మార్కులు, ఉద్యోగమే కాకుండా సమాజంలో ఉన్న సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ ఇన్‌ఛార్జి ఎం.శ్రీనివాసరావు, కళాశాల బీసీ డీఈ కోఆర్డినేటర్ కే. రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

## మల్లివీడు చిత్రీకరణ ప్రారంభం

(సత్యంన్యూస్,ఆమదాలవలస)

జై కళింగ స్టూడియో సమర్పణలో కళింగ ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై గూన అప్పారావు స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న మల్లివీడు చిత్రం చిత్రీకరణ ఆమదాలవలసలో శుక్రవారం లాంచనంగా ప్రారంభమైంది. ఈ చిత్రానికి భవన నిర్మాణ కార్మిక నాయకుడు సువ్వారి రమణ క్లాప్ కొట్టారు. దేశభక్తి ప్రధానమైన ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుందని చిత్ర దర్శక నిర్మాత గూన అప్పారావు తెలిపారు. ఇప్పటికే ఈ బ్యానర్‌పై ఆకలి మూవీ పూర్తి చేశామని, త్వరలో పాటలు రిలీజ్ చేసి, నెలరోజులలో చిత్రాన్ని విడుదల చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో చిత్ర హీరో మోహన్ భరద్వాజ్, హీరోయిన్ స్వప్నికా రెడ్డి, ప్రభాకర్, వాసుదేవ్, బమ్మిడి కృష్ణారావు, ప్రముఖ యోగా సైంటిస్ట్ పాపారావు, ప్రముఖ వ్యాపారి లఖినాన సత్యం, కెమెరా వెంకట్ రవి, ఫైట్స్ కృష్ణంరాజు, స్టిల్స్ అనంత్, కొరియోగ్రాఫర్ బండ్ల రామారావు, మేకప్ సంతోష్ పాల్గొన్నారని తెలిపారు.



# దానా ఎఫెక్ట్!

**- బోసిపోయిన రైల్వేస్టేషన్**

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఒడిశాలో బీభత్సం సృష్టిస్తున్న దానా తుఫాను కారణంగా చాలా వరకు రైళ్లు రద్దువడంతో ప్రయాణికులు లేక శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్‌తో పాటు ఈస్ట్‌కోస్టు పరిధిలో పలు రైల్వేస్టేషన్లు బోసిపోయాయి. దీపావళి పండుగ వేళ కిటకిటలాడాల్సిన రైల్వేస్టేషన్లు తుపాను కారణంగా ఖాళీగా కనిపిస్తున్నాయి. మారుమూల ప్రాంతాలకు శ్రీకాకుళం రోడ్ ప్రధాన రైల్వేస్టేషన్‌గా గుర్తింపు ఉంది. కొంతమంది ప్రయాణికుల సరైన సమాచారం అందకపోవడంతో రైళ్లు లేవని తెలిసి తిరిగి వెనుతిరుగుతున్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.